


సత్యం వద...ధర్మం చర - నిజ నిర్వచనం కేవీ రామకృష్ణ

2007 అనుకుంటాను. శివశక్తి సంస్థల నుండి నేను ICOMM సంస్థలో కార్యదర్శి గా బాధ్యతలు చేపట్టాను. ఆత్మీయులు...మార్గదర్శి అయిన CS PS రావు నన్ను అక్కడి యాజమాన్యానికి పరిచయం చేసారు. సుమంత్ ఆ సంస్థ కార్యనిర్వహణ చేస్తున్నారు. నన్ను చూసి, నచ్చి... నాతో మాట్లాడి, నాకు ఉద్యోగం ఇచ్చారు. చాలా పెద్ద సంస్థ...అందులోనూ ముంబై నుండి ఇన్వెస్టర్లు కూడా పెట్టుబడులు పెట్టారు. వ్యాపార నిర్వహణ మరియు యాజమాన్య అజమాయిషీ చాలా బాధ్యతతో కూడి ఉండేది. తరచుగా ఉన్నత ఉద్యోగులను కలవడం జరిగేది. బోర్డు మీటింగ్ లు కూడా చాలా నిక్కచ్చిగా జరిగేవి. చాలా కీలకమైన బాధ్యత నాది. ఎంతో జాగ్రత్తగా పని చేసేవాడిని. కానీ సేవ ఎక్కడా ఆగలేదు. ఆఫీసు లో కొత్త పరిచయాలు...కొత్త వాతావరణానికి ఇంకా అలవాటు పడుతున్నాను. అలాంటి సమయంలో మొదటి సారి బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసాము. సంస్థ లోపలి నుండి మరియు బయట నుండి డైరెక్టర్లు మరియు ఆడిటర్లు వచ్చారు. నేను చాలా ఉత్సాహంగా అందరిని ఆహ్వానిస్తున్నాను.

ఇంతలో ఒక అపరిచితుడు సూటు బూటుతో, వచ్చి రాగానే... నన్ను స్నేహంగా పలకరించాడు...ఏయ్! నువు బాలచంద్ర కదా!? అంటూ...నేను వారికి నమస్కరిస్తూ...ఒకింత ఆశ్చర్యంతో అడిగాను. అవునండి. నేనెలా మీకు తెలుసు అని. అప్పుడు చెప్పారు...మీ పేరు ముంబై లో కూడా తెలిసిపోయింది అని. చాలా అంటే చాలా ఆశ్చర్య పోయాను.

వారు, ముంబై నుండి బోర్డు మీటింగ్ కు వచ్చిన KV Ramakrishna, Independent Director, ICOMM అంతే కాక Head, Kotak Pvt Equity Fund. హైదరాబాద్ కు రాక మునుపే నా గురించి తెలుసుకోవడం అంటే సామాన్యమైన విషయం కాదు. తరవాత తెలిసింది హైదరాబాద్ వాస్తవ్యులైన CMA A దుర్గాప్రసాద్, అప్పటి కాస్ట్ అకౌంటెంట్స్ కు దేశాధ్యక్షులు,  మాటల సందర్భంలో సేవా కార్యక్రమాల గురించి మాట్లాడుతున్నపుడు...నా ప్రస్తావన వచ్చిందట. అంతే కాక, నేను అభయ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవల గురించి కూడా తెలిపారట. ఎంతో ఆనందం అయింది.

వారు చాలా చురుకుగా, కంపెనీ బోర్డు మీటింగ్ లో భాగం వహించారు. నాకెంతో ఉత్సాహం కలిగింది వారిని చూసినపుడు.  వారు హైదరాబాద్ లో కంపెనీ సమావేశాలకు వచ్చినప్పుడు మా పరిచయం పెరిగింది.

మొట్ట మొదటి సారి...ఒక వృత్తి నిపుణుడు సరైన వాడై వుంటే...వ్యక్తులను...వ్యాపారాలను...వ్యవహారాలను... వాణిజ్యాలను... యాజమాన్యాలను...పరిశ్రమలను ఎంత ప్రభావితం చేయచ్చు అని నేను గమనించాను.

చేస్తున్న ఉద్యోగానికి 100% న్యాయం చేయడం ఎలా? అన్నది వారిని చూసినప్పుడు అర్థం అయ్యేది. అరె ఎక్కడైనా మనుషులు ఇంత సౌమ్యంగా...సుహృద్భావంగా...సునిశితంగా...కర్తవ్య నిర్వహణ చేయగలరా అనిపిస్తుంది. ఎలాంటి గురువులు లేక ఏ ఆధ్యాత్మిక వాదము లేకుండా...ఇలా జీవించడం సాధ్యమా అని అచ్చెరువొందాను కూడా.

నన్ను అత్యంత ప్రభావితం చేసిన కొద్ది మంది వ్యక్తులలో నేను తప్పక జీవితాంతం గుర్తుంచుకునే వ్యక్తి రామకృష్ణ. - Balachandra